# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# అతను నాకు నచ్చాడు

" సూసన్" ఈరోజు నీలో ఏదో ప్రత్యేకత ఉంది. యూ లుక్ మోర్ బ్యూటిఫుల్ దేన్ ఎవర్. ఏమిటి విషయం?? " అంది సాహితి తను వేసుకున్న పొడవాటి ఉన్ని కోటు తీసి స్టాండ్ కి తగిలిస్తూ. తలకి పెట్టుకున్న టోపీ కూడా తీసి అక్కడే పెట్టి,చలి బూట్లు విప్పి హాస్పటల్ లో వేసుకోవలసిన చెప్పులు వేసుకుంది.

" యా, ఐ యాం రియల్లీ హేపీ అండ్ వై నాట్??" అంది సూసన్ నవ్వుతూ. తెల్లని పొడుగు చేతులున్న టాప్ వేసుకుంది ముదురు నీలం రంగు జీన్స్ మీద. కుదురుగా దువ్వుకున్న బంగారు రంగు జుట్టు భుజాలనంటుతోంది. ఎప్పుడూ నవ్వుతున్నట్లుండే విశాలమైన ఆమె నీలి కళ్ళు ఈ రోజు మరింతగా నవ్వుతున్నాయి. కొనతిరిగిన చిన్న ముక్కు, పల్చటి చెక్కిళ్ళూ,అందమైన పెదాలు. ఎంతో బావుంటుంది సూసన్ అని సాహితి ఎప్పుడూ అనుకుంటూనే ఉంటుంది.అందమే కాదు చాలా ప్రతిభావంతురాలైన డాక్టర్ కూడా. అమెరికాలోని అతి ప్రముఖమైన మెడికల్ స్కూల్ నించి పట్టా పుచ్చుకుంది

" ఓహో, అందానికి ఆనందం తోడయిందన్నమాట, అందుకేనా ఇంత కాంతి, కళ" అంది సాహితి తను కూడా నవ్వుతూ.

అందంగా నవ్వింది సూసన్. "యా, యూ ఆర్ రైట్" అంది. ఇద్దరూ కెఫెటీరియా వైపు నడిచారు.

ఇద్దరూస్నేహితురాళ్ళు. సూసన్ చాలా నెమ్మదిగా ఉంటుంది. సాహితి లాంటివారికన్నా ఎంతో అనుభవం ఉన్నది అయినా ఎప్పుడూ ఎలాంటి భేషజాలు చూపించదు, అందరితోనూ స్నేహంగా ఉంటుంది. వాళ్ళకి తెలీని విషయాలెన్నో చెప్తూ ఉంటుంది. లేకపోతే పేషెంట్లపనితోనో, అది లేకపోతే ఏదో ఒకటి చదువుకుంటూనో ఉంటుంది తప్ప ఎప్పుడూ సమయాన్ని వృధాగా మాత్రం గడపదు. ప్రకృతి అన్నా, పుస్తకాలన్నా ఎంతో ఇష్టం ఆమెకి.

సాహితిగలగలామాట్లాడుతూఉరకలేసే గోదారిలాఉంటుంది.

"ఇంతకీ అసలు విషయమేమిటో తెలుసుకోవచ్చా?" అంది చిలిపిగా. బ్రేక్ ఫాస్ట్ ప్లేట్ తెచ్చుకుంటూ.

" నా పెళ్ళి" సూసన్ చెప్పింది.

" వావ్ రియల్లీ! నాకింతవరకూ తెలీదే! భలే దాచావుగా దొంగా! ఎవరు? ఎవరు? చెప్పు, చెప్పుతొందరగా! " అందినోట్లోపెట్టుకోబోతున్న బ్రెడ్ టోస్ట్ ని ప్లేట్లోనే పడేసి. ఆ సందడిలో అది నేలమీద పడిపోయింది..

ఆమెతీరుచూసిఫక్కుననవ్విందిసూసన్. మళ్ళీతలవంచుకుని కార్న్ ఫ్లేక్స్ తినసాగింది.

"ఇక్కడ నేనేమో నా టోస్ట్ త్యాగం చేసేసి మరీ సంతోషపడుతున్నాను నా స్నేహితురాలి పెళ్ళి అని. నువ్వు మాత్రం నీ కార్న్ ఫ్లేక్స్ లోంచి తల అయినా తిప్పడం లేదు చూడు" అంది సాహితి చిరుకోపంగా.

మళ్ళీ నవ్వింది సూసన్. " టేక్ ఏ గెస్" అంది కళ్ళు చికిలించి భుజాలెగరేస్తూ

" డాక్టర్ విల్సన్?? "అంది తాను చాలా కరెక్ట్ గా చెప్పాను అన్న భావన ఆమె గొంతులో స్పష్టంగానే వినిపించింది.

విల్సన్ కి సూసన్ అంటే చాలా ఇష్టం అని సాహితికి మాత్రమే కాదు, చాలా మందికి తెలుసు. అతను గతంలో ఒకసారి ప్రొపోజ్ చేస్తే సూసన్ సున్నితంగానే తిరసరించింది. ఇప్పుడైమైనా మనసు మార్చుకుందేమో అన్న అనుమానంతోనే అతని పేరు చెప్పింది మొదట. విల్సన్ చాలా పేరున్న కార్డియాలజిస్ట్. అతని అపాయింట్మెంట్ దొరకడమే కష్టం. అందగాడు, ఆస్థిపరుడు, పేరున్న డాక్టర్. కానీ

ఎందుకో సూసన్ అవును అనలేదు, కనీసం తనకి టైము కావాలని కూడా అనలేదు. నో అంది, సాహితి ఎంతో ఆశ్చర్యపోయింది ఆ మాట విన్నప్పుడు.

"కాదు, కాదు" అంది సూసన్ కంగారుగా

"మరెవరబ్బా? " ఆలోచిస్తూనే "గౌతం? "అంది మళ్ళీ.

గౌతం ఈ మధ్యనే తమ హాస్పటల్ లో చేరిన సీనియర్ డాక్టర్. అమెరికన్ ఇండియన్. అందరితోనూ సరదాగా ఉంటాడు. పైకి చెప్పకపోయినా సూసన్ ని ఇష్టపడ్డాడు. ఆ మాట ఏమాత్రం మొహమాటం లకుండా సూసన్ కి చెప్పాడు, నవ్వింది తప్ప ఏమీ చెప్పలేదు.

"రాంగ్" అందిసూసన్.

" ఓకే! ఐ గివ్ అప్. నువ్వేచెప్పు" అందిసాహితి.

" నేను డాక్టర్నే పెళ్ళి చేసుకుంటానని ఎందుకనుకుంటున్నావు?" అందిసూసన్.

"సాధారణంగా అలా జరుగుతుంది కదా అని అనుకున్నాను, ఓకే. హాలీవుడ్లో ఎలిజిబుల్ బేచులర్స్ ఎవరున్నారబ్బా?" అని ఆలోచన నటిస్తున్న సాహితిని చూసి నవ్వింది సూసన్.

" చాల్లే ఆపు జోకులు, నేనూ నేనూ, క్రిస్ వచ్చేనెల్లో చర్చ్ వెడ్డింగ్ చేసుకుంటున్నాము" అంది సూసన్ నెమ్మదిగా.

"క్రిస్?? క్రిస్అంటే?" అనుమానంగాఅడిగిందిసాహితి.

" క్రిస్.. నువ్వు కలిశావు కదా, మనం క్రిందటిసారి పార్క్ కి వెళ్ళినప్పుడు. తనే క్రిస్ మిల్లర్" అంది. ఆ పేరు చెప్తున్నప్పుడు ఆమె ముఖంలో వచ్చిన వెలుగును సాహితి చిత్రంగా చూసింది.

పై చదువులు, ఉద్యోగంవల్ల ఈ దేశంలో కొన్నేళ్ళుగా ఉండడంవల్ల ఇక్కడి పధ్ధతులూ, ఇతరులతో మెలిగే తీరూ నేర్చుకున్న సాహితి వెంటనే " అతనా? ఆ కార్పెంటరా?" అని అనలేదు. అదే కొన్నేళ్ళక్రితమైతే తన పాత అలవాట్ల ప్రకారం అనేసేదే.

" ఓ, క్రిస్, యా, యాగుర్తొచ్చింది. వెరీనైస్, కంగ్రాచ్యులేషన్స్" అంది సూసన్ చేతిని తనచేతిలోకి తీసుకుంటూ.

"థాంక్యూ. అసలు నేను ప్రపోజ్ చేస్తే క్రిస్ ఒప్పుకుంటాడా? అని ఎంతో సందేహించాను. ఏదో ఒక వంక పెట్టి తప్పుకుంటాడనుకున్నాను. కానీ వెంటనే ఒప్పుకున్నాడు, తను కూడా నా పట్ల సీరియస్ గా ఉన్నాడని అర్థం అయింది. "ఐ యాం రియల్లీ లక్కీ!" అంది సూసన్ సంతోషంగా.

" అవునా, నైస్" " గ్రేట్" లాంటి మాటలతో ఆమె చెప్పింది పూర్తిగా వింది. ఆ తర్వాత డ్యూటీ టైం అవడంతో ఇద్దరూ తమ తమ రూముల వైపుకు కదిలారు.

మొదటి పేషెంట్ ని చూసి పంపించింది సాహితి. రెండో పేషెంట్ రాలేదుట అందుకని కొంచం టైముంది అని నర్స్ చెప్పింది. దాంతో ఆలోచనలో పడింది.

" సూసన్ క్రిస్ ని చేసుకుంటోందా? ఎలా? దేవకన్యలాంటి సూసన్ వెనక పడినవారి సంఖ్య తనకే రెండంకెల్లో తెలుసు. అలాంటిది ఆమె క్రిస్ ని చేసుకోవడమేమిటి? అది కూడా తనే ప్రపోజ్ చేసిందా? దానికింత సంబరమేమిటో? చాలా మంచివాడేమో అతను? ఎంత మంచివాడయినా మాత్రం ఎక్కడ హార్వర్డ్ మెడికల్ స్కూల్? ఎక్కడ కార్పెంటర్? ఏదో ఉద్యోగం చేస్తాడుట, కార్పెంట్రీ హాబీట. ఈ నిర్ణయం వల్ల సూసన్ సంతోషంగా ఉంటుందా? తర్వాత విచారించదు కదా? ' సమాన వియ్యం, సమాన కయ్యం అనే మాటలు వీళ్ళకి వర్తించవా? అమ్మా, నాన్నా అదే మాట అంటూ ఉంటారు కదా తను తీసుకున్న నిర్ణయం వల్ల సూసన్ ఎంతో ఆనందంగా ఉందనేది మాత్రం కాదనలేని నిజం. కానీ ఎలా? ఎవరినీ జడ్జ్ చెయ్యని ఈ సమాజం వల్లా? ఇలాంటి నిర్ణయం తను తీసుకోగలదా?"

ఇలా రక రకాల ఆలోచనలు సాహితి మనసు నిండా. తప్పు చేస్తోందేమో సూసన్! ఎంత స్నేహితురాలైనా తన ఆంతరంగిక విషయాల్లో కల్పించుకోవడం బావుండదు కదా! అయినా సూసన్ తన నిర్ణయం చెప్పింది తప్ప ఎవరి అభిప్రాయాలు అడగలేదు కదా!' ఇలా ఆలోచనల్లో ఉండగానే తర్వాత పేషెంట్ వచ్చేయడంతో పనిలో పడింది ఆమె.

సాయంత్రం పని ముగించుకుని బయలుదేరేముందు ఆత్రంగా ఇండియాలో అక్కకి ఫోన్ చేసింది. అక్క స్రవంతి ఫోన్ ఎత్తగానే గబ గబా విషయం చెప్పేసింది.

" ఎలా అక్కా? సూసన్ గురించి నీకు ఎప్పుడూ చెప్తాను కదా, షీ ఈజ్ ఏన్ ఎంజెల్. విద్యలోనూ, వినయంలోనూ, వ్యక్తిత్వం లోనూ ఎందులో చూసినా వంక పెట్టలేని మనిషి. ఇన్నాళ్ళూ ఎంతమంది అడిగినా వద్దు అంటూ ఉంటే నేను ఇంకా ఏదో అనుకున్నాను కానీ ఇప్పుడు అసలు విషయం చెప్పింది " అంటూ అన్ని వివరాలు చెప్పింది.

విన్నాకా ఆమె అక్క స్రవంతి కూడా ఆశ్చర్యపోయింది. " అలాగా? ఎందుకే? సూసన్ కి పైకి చెప్పుకోలేని ప్రోబ్లం ఏదైనా ఉందేమో? లేకపోతే అలా ఎందుకు చేస్తుంది? " అంటూ తనకి తోచిన వ్యాఖ్యలు చేసింది. తనకి ఏ మాత్రం సంబంధం లేని మూడో వ్యక్తి గురించి అలా మాట్లాడేందుకు తనకేమీ హక్కు లేదని కూడా ఆమెకి స్ఫురించలేదు.

" వాళ్ళింట్లో ఒప్పుకుంటారుటే?" అనుమానంగా అడిగింది.

" ఒకరొప్పుకునేదేమిటక్కా? ఇక్కడ పెద్దవాళ్ళు ఒక వయసు దాటిన తమ పిల్లలని పూర్తిగా పెద్దవారుగానే చూస్తారు. తప్పు వాళ్ళ విషయాల్లో అవసరం లేకుండా కల్పించుకోరు కదా. వారి నిర్ణయాలన్నీ వాళ్ళే తీసుకుంటారు. అయినా సూసన్ చిన్నపిల్ల కాదు కదా! నీకంటే కూడా పెద్దదే! కనీసం ఇరవై ఎనిమిదైనా ఉంటాయి. అలాంటి అమ్మాయికి ఒకరు చెప్పేదేమిటి? చెప్పు. నిజానికి ఇక్కడి వారైతే తన గురించి ఇంటర్నేషనల్ కాల్ చేసి మరీ ఇలా డిస్కస్ చెయ్యరు కూడా! " అంది నవ్వుతూ.

" ఆ మాట నిజమే! నీ స్నేహితురాలు కదా అని మనం మాట్లాడుకుంటున్నాం అంతే" అని సమర్ధించుకుంది స్రవంతి. ఆ తర్వాత మాట్లాడుకోవడానికి మరేమీ లేనట్టు ఆ విషయమే మరో పావుగంట మాట్లాడుకున్నారు అక్క చెల్లెళ్ళిద్దరూ. ఆ తర్వాత ఫోన్ పెట్టేసింది.

మర్నాడు సూసన్ తను రిజైన్ చేసిందనీ, క్రిస్ ఉండే చిన్న ఊరు కాన్సస్ రాష్ట్రం లోని టొపెకా వెళ్ళిపోతాననీ చెప్పడంతో సాహితి కి మతి పోయింది. ఇంక ఆపుకోవడం ఆమె వల్ల కాలేదు.

" సూసన్! నువ్వేమీ అనుకోనంటే ఒక్క మాట అడగనా?" అంది నెమ్మదిగా.

" యా ష్యూర్! అడుగు, యూ ఆర్ మై ఫ్రెండ్" అంది సూసన్.

" థాంక్ యూ.. కానీ నువ్వేమీ అనుకోకూడదు" అంది సాహితి బెరుగ్గా.

" కమాన్ సాహితీ, గో ఎహెడ్" అంది సూసన్ నవ్వుతూ..

" మిస్టర్ మిల్లర్, అదే క్రిస్ నీకు ఎలా పరిచయం? నువ్వెంతో ఇష్టపడే ఈ నర్సింగ్ హోం నీ, ఇంత పెద్ద నగరంలో నీకెంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చిన ఈ ఉద్యోగాన్నీ వదిలేసి వెళ్తున్నావంటే హీ మస్ట్ బీ సం థింగ్" అంటూనే ఇంకా ఎక్కువగా మాట్లాడితే ఏమనుకుంటుందో అన్నట్టుగా ఆగిపోయింది.

నవ్వింది సూసన్. " నాకర్థం అయింది నువ్వు చెప్పేది! నిన్న విల్సన్ కూడా అడిగాడు. ఐ.నో అతను అలా అడగకూడదు ఎందుకంటే ఇది వ్యక్తిగత విషయం కానీ నీకు తెలుసు కదా !అతను ఎందుకు అడిగి ఉంటాడో! నేను క్రిస్ ని ఇష్టపడటానికి కారణం ఇదీ అని ఒకటి ప్రత్యేకంగా చెప్పలేను. చాలా కారణాలు ఉన్నాయి. అయినా ఇలా లెక్కలు వేసుకుని ప్రేమిస్తారా? నువ్వు అడిగావు కనక చెప్తున్నాను. అతని ఆలోచనా విధానం నచ్చింది. బ్రెస్ట్ కేన్సర్ ఉన్న అమ్మని చూసుకోవడానికి అతను పడే కష్టం నచ్చింది. వృత్తినీ, ప్రవృత్తినీ బాలెన్స్

చేసుకుంటూ ఎప్పుడూ సరదాగా ఉండగలిగే తీరు నచ్చింది. ఇలా ఎన్నో. అతనేమీ సంఘ సంసర్త కాదు, సంపన్నుడూ కాదు, కానీ నాకు నచ్చాడు

మొదటిసారి మేము ఆరునెలల క్రితం అనుకుంటా ఒక వాలంటరీంగ్ సమావేశంలో కలిశాము. కామన్ ఫ్రెండ్స్ ద్వారా మాకు పరిచయం అయ్యింది. మొదటిరోజు పని పూర్తి చేశాకా రాత్రి బోన్ ఫైర్ ఏర్పాటు చేశారు. అప్పుడు సరదాగా సాగిన సంభాషణలో " జీవితం పట్ల మీ అభిప్రాయం ఏమిటి? మీ లక్ష్యం ఏమిటి?" అని కో ఆర్డినేటర్ అడిగిన ప్రశ్నకి అందరం తలో రకంగా సమాధానాలు చెప్పాము.

ఉదాహరణకి నేను అప్పుడున్న మైండ్ సెట్ తో " అమెరికాలోనే గొప్ప డాక్టర్ గా పేరు తెచ్చుకోవాలని ఉందని చెప్పాను" అలానే ఒకరు వాల్ స్ట్రీట్ ని ఏలాలని ఉందనీ, మరొకరు ప్రపంచమంతా చుట్టి రావాలని ఉందనీ, మరొకరు ఛాన్స్ దొరికితే వైట్ హౌస్ లో ఉండాలని ఉందనీ ఇలా చాలా చెప్పారు.

ఒక్క క్రిస్ మాత్రం " ప్రతీ నిమిషం జీవించడం, జీవితాన్ని ప్రేమించగలగడం " అన్నాడు.

"ఇంటరెస్టింగ్. కొద్దిగా వివరించగలరా? అని అడిగాడు కో ఆర్డినేటర్.

" మన దైనిక పరుగుపందెం లో రోజుల్ని గంటల్లా, గంటలని నిమిషాల్లా, నిమిషాలని సెకండ్లుగా కరిగించి పరిగెడుతున్నాము. వెనక్కి తిరిగి చూసుకుంటే దాటిన మైలు రాళ్ళు కనపడతాయి తప్ప మనసు పెట్టి జీవించిన క్షణాలు కనపడకపోతే ఆ పరుగుకి అర్థం లేదు. అందుకే నాకలాంటి పరుగు వద్దు, నేను నడిచి వచ్చిన దారిలో కనీసం నాకు రెండు మనసును సేద తీర్చే మజిలీలు ఉంటే నేను జీవితాన్ని జీవించినట్టు నాకు లెక్క. అలా ప్రతీ క్షణం ఉండాలనేది నా కోరిక. అందుకనె జీవితాన్ని ప్రతీ క్షణం జీవించడం ముఖ్యం.. అన్నాడు క్లుప్తంగానే.

"ఆ మాటలు నాకెంత నచ్చాయో తెలుసా సాహితీ? నేను చిన్నప్పటినించీ ఈ పెద్ద నగరం లో పెరిగాను, పెద్ద పెద్ద స్కూళ్ళల్లో చదివాను. ఎందరో మేధావులని కలిశాను, కలిసి పని చేశాను. వారి సాంగత్యంలో చాలా నేర్చుకున్నాను. ఈ జీవితంలో ఎన్నో విజయాలు, చాలా అరుదుగా చిన్న నిరాశలు. ఆల్మోస్ట్ నన్. కానీ ఎప్పుడూ ఏదో మిస్ అవుతున్న భావన నన్ను తడిమేది, తరిమేది. ఈ మధ్యన మరీ ఎక్కువైంది. ఎందుకో తెలీదు కానీ క్రిస్ పరిచయం లో అది కొద్దిగా తగ్గిన భావన ఈ మధ్యన కలుగుతోంది. జీవితం పట్ల అతనికున్న అభిప్రాయం, స్పష్టతా నన్నెంతో ఆకట్టుకోవడం మొదలుపెట్టాయి. అతను మాములుగా చదువుకున్నాడు, చిన్న ఉద్యోగం చేస్తాడు, దానికి తోడు కార్పెంటరీ స్టూడియో ఉంది. తనకి నచ్చిన ఫర్నిచర్ చేస్తాడు, అమ్ముతాడు. అంతేకానీ పెద్ద షాప్ గానీ, బిజినెస్ కానీ పెట్టాలని అతనికి లేదు. నాకూ, నా ఫేమిలీ కి సరిపోయేంత సంపాదిస్తాను. దానికంటే ఎక్కువ అవసరం లేదు. అంటాడు. ఎందుకో తెలీదు కానీ అదే నాకు నచ్చింది. సంపన్నులుగా బతకాలని అనుక్షణమూ కష్టపడే వారిని చూశాను, బ్రతుకుని సుసంపన్నంగా ఎలా చేసుకోవాలో క్రిస్ ని చూసే నేర్చుకున్నాను. అతనికి ముగ్గురు అక్కలూ, ఇద్దరు అన్నలూ ఉన్నారు. అందరూ ఆ చుట్టుపక్కలే ఉంటారు. ఎంతో ప్రేమగా ఉంటారు. తరచూ కలుస్తూ ఉంటారు. వాళ్ళే నా బలం, బలహీనతా కూడా అంటాడు.

ఇలా చిన్నా పెద్దా విషయల్లో అతను చేసే పనులూ, చెప్పే మాటలూ అన్నీ నాకెంతో నచ్చాయి సాహితీ. నేను ప్రపోజ్ చేసినప్పుడు కూడా " నువ్వంటే నాకెంతో ఇష్టం సూసన్, నన్ను ఇష్టపడడానికి నీకు తగినన్ని కారణాలు కనిపించాయని అనుకుంటాను. నీకు కావలసినవన్నీ నేను సమకూర్చలేకపోయినా, మనం కలిసున్నంతకాలమూ నిన్ను సంతోషంగా ఉంచగలనని మాత్రం ప్రామిస్ చెయ్యగలను." అన్నాడు

మహానగరాల్లో ధనవంతుల బిడ్డగా ఎన్నో సౌకర్యాలతో పెరిగాను నేను. నేను అక్కడ ఇమడగలనా? అని నేనూ ఆలోచించాను కానీ ఎందుకో నా మనసు అతని వైపే మొగ్గింది సాహితీ. ఐ థింక్ ఐ విల్ బీ వెరీ హేపీ విత్ హిం అండ్ ఇప్పుడు నాకదే కావాలి." అంది సూసన్. ఆశ్చర్యంగా వింది సాహితి.

" ఇంత చిన్న చిన్న విషయాలకి అలాంటి సామాన్యుణ్ణి ప్రేమించిందా?? ఇదేదో సినిమాల్లో చూపించినట్టుగా ఉంది. ఇలాంటి పని తను చెయ్యగలదా? చేసినా అమ్మా, నాన్నా ఒప్పుకుంటారా? "ఇలా సాగుతున్నాయి ఆమె ఆలోచనలు.

"హే ఏం ఆలోచిస్తున్నావు? నేను కూడా ఇలాగే ఆలోచించాను మెదడుతో కాకుండా మనసుతో నిర్ణయం తీసుకుంటున్నానా? అని. కానీ ఇప్పుడు ఐ యాం క్లియర్. నేను సంతోషంగా ఉంటాను" అంది నవ్వుతూ.

మరొక నెల తర్వాత పెళ్ళిలో ఉంగరాలు మార్చుకున్నారు ఇద్దరూ. అతిధులందరినీ పలకరిస్తున్నారు క్రిస్, సూసన్.

" నెలరోజులు మా కార్లో అమెరికా లో ఎంత వీలైతే అంత వరకూ తిరుగుతున్నాం" చెప్పింది సూసన్ నవ్వుతూ హనీమూన్ కి ఎక్కడకు వెళ్తున్నారు? అన్న సాహితి ప్రశ్నకి. అప్పుడప్పుడు స్టార్ హోటల్లో, మరొక్కప్పుడు స్టార్స్ కింద మా బస అవుతుంది తెలుసా? " అంది నవ్వుతూ.

" నా బిజీ డాక్టర్ వైఫ్ ఇంటికి వచ్చేసరికి ఈ చిరుద్యోగి ఇల్లు నీట్ గా ఉంచి, పిల్లలని జాగ్రత్తగా చూసుకుంటాడు. ఆమె అలసిపోకుండా చూసుకోవాలి కదా!" అంటున్నాడు క్రిస్ అల్లరిగా నవ్వుతూ ఎవరో అడిగిన ప్రశ్నకి.

" సూసన్ అంత అందమైన తెలివైన పిల్లలు కలగాలి మీకు" అంది క్రిస్ వాళ్ళ అమ్మ తను తెచ్చిన ప్లాటినం ఉంగరాలు ఇద్దరికీ ఇస్తూ.

" నీ కోరిక నిజమవ్వాలని కోరుకుందాం అమ్మా! అలా జరిగితే వాళ్ళు నీ కోడలంత ప్రతిభావంతులవుతారు, మంచిదే.. కానీ ఒకవేళ నీ కొడుకులాంటి పిల్లలు కలిగితేనో?" చిలిపిగా తల్లిని ఆటపట్టిస్తూ అన్నాడు.

" వాళ్ళు జీవితాన్నే కాదు, అమ్మా నాన్నలని కూడా ప్రేమిస్తారు" అంది సూసన్ అతన్ని మెత్తగా హత్తుకుంటూ.. ఆమె కళ్ళల్లో సంతోషం, ముఖంలో ఉల్లాసం. స్నేహితురాలి సంతోషం చూసి సాహితి తృప్తిగా నిట్టూర్చింది.

COMMENTS